ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

బుధవారం 7 మే 2025





- ఎల్‌ఆర్‌ఎస్‌కు మళ్లీ ఛాన్స్
- ఈనెల 31 వరకు గడువు పొడిగింపు
- ఇప్పటివరకు రూ.19 కోట్ల ఆదాయం
- జిల్లాలో 42,942 దరఖాస్తులు

స్పందన అంతంతే..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్)కు గడువు పొడిగిస్తున్నా ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో అధికారులు కదలరు.. దరఖాస్తుదారులు ముందుకు రారు.. అన్నట్లుగానే మారింది. నాలుగోసారి గడువు పొడిగిస్తూ మే 31వరకు ప్రభుత్వం మరో అవకాశాన్ని ఇచ్చింది. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా దాదాపు రూ.40 కోట్ల వరకు ఆదాయం వస్తుందని భావించినా మే 3 వరకు ఇచ్చిన గడువు మేరకు జిల్లాలో రూ.19 కోట్ల వరకు మాత్రమే ఆదాయం లభించింది.

● సాంకేతిక సమస్యలే...

భూముల క్రమబద్ధీకరణతో ఆదాయం సమకూరుతుందని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి నిర్దేశిత ఫీజులో 25శాతం రాయితీ ప్రకటించినా జిల్లాలో అనుకున్న మేరకు స్పందన లభించలేదు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారు. యూజర్ మాన్యువల్ ఫీ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌కు సంబంధించి సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయని చెబుతున్నారు. సర్వర్‌లు బిజీగా ఉండడం, ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మరోవైపు దరఖాస్తుదారులకు నేరుగా ఆటో జనరేట్ మేసేజ్‌లు వెళ్లకపోవడం, సర్వర్‌లు మొరాయించడం వంటి ఇబ్బందులను దరఖాస్తుదారులు ఎదుర్కుంటున్నారు. దీంతోపాటు ఎన్నో వ్యయప్రయసాలకు ఓర్చి దరఖాస్తులు చేసుకున్న వారికి సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఎల్ 1 దశలోనే దరఖాస్తులకు బ్రేక్‌లు పడుతున్నాయని వాపోతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు మూడంచెల విధానం ఉండడంతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పథకంగా ఉండడంతో గడువు ముగిసినా మే31 వరకు మళ్లీ పొడిగించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూములను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుదారులకు చెల్లింపునకు 25శాతం రాయితీ కల్పించినా రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంతంత మాత్రంగానే దరఖాస్తుదారుల నుంచి స్పందన వచ్చింది. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో అధికారుల మధ్య సమన్వయలోపం, దరఖాస్తుదారులను ప్రోత్సహించకపోవడంతో ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మార్చి 31 వరకు ఇచ్చిన రాయితీ గడువు ముగిసినా ఎల్‌ఆర్‌ఎస్ అట్టర్ ప్లాప్‌గానే కొనసాగింది. దీంతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ గడువును ఏప్రిల్ 30 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఈనెలలోనైనా అధికారులు దరఖాస్తుదారులను ప్రోత్సహించి ఎల్‌ఆర్‌ఎస్ పక్రియను వేగవంతం చేసి ఇటు ప్రజల సమస్యలను తీర్చడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం ఎంత మేరకు చేకూరుస్తారనే దానిపై అనుమానాలే వ్యక్తం అవుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కింద 42,942 దరఖాస్తులు వచ్చాయి. గత నెలలో 37,071 మంది దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించే విధంగా సమాచారం అందించారు. 4,896 దరఖాస్తులను తిరస్కరించారు. మార్చి 31 వరకు రూ.17.33 కోట్లు ఆదాయం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా సమకూరింది. తరువాత ఏప్రిల్30 వరకు గడువు ఇచ్చారు. సాంకేతిక సమస్యలతో మే3 వరకు అవకాశం ఇచ్చారు. కానీ పెద్దగా స్పందన లభించలేదు. రూ 19కోట్ల వరకే పెరిగింది. గడువు పొడిగిస్తున్నా అనుమతి లేని ప్లాట్లు లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్‌ఆర్‌ఎస్‌లో 25శాతం రాయితీ నిర్ణయంతో దరఖాస్తుల ప్రక్రియ పూర్తవుతుందని ప్రభుత్వం భావించినా అనుకున్న మేరకు సక్సెస్‌గా ముందుకు వెళ్లడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలతో పాటు 260 గ్రామ పంచాయతీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ కోసం 42,942 దరఖాస్తులు వచ్చాయి. 2020 సెప్టెంబరులో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రజలపై మోయలేని భారం మోపిందనే అభిప్రాయంతో ఎవరూ దరఖాస్తులు చేసుకున్నా ముందుకురాని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలు గ్రామపంచాయతీల్లో అక్రమ లేఅవుట్‌లు, రిజిస్ట్రేషన్లు లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు సెప్టెంబరు 1, 2020న బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 26 ఆగస్టు 2020లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసిన లే అవుట్‌ల యజమానులు ప్లాట్ ఓనర్లకు ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించింది. కానీ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎప్పుడో 20ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకొని ఇంటి పన్నులు చెల్లించి క్రయవిక్రయాలు జరిపిన వారు కూడా ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించే పరిస్థితి నెలకొంది. లేనిపక్షంలో క్రయ విక్ర యాలు జరిపే అవకాశం లేని పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయడానికి నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రకటనలు చేసి సర్వేలు చేయడానికి జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. గత సంవత్సరం జూలై నెలలో..

మిగతా 8లో

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మహేశ్ బి గితె

సిరిసిల్ల క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేశ్ బీ గితె అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొత్త రంబర్‌ల నుంచి వచ్చే కాల్స్, లింక్స్ ఏపీకే మెసెజ్‌లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశ ఇబ్బందులపాలు చేస్తుందన్నారు. సైబర్ నేరాలకు గురైతే గంటలోపు టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పోగొట్టుకున్న మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్‌కి ఆఫర్లు, డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింక్స్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేస్తే మొబైల్ హ్యాక్ అయ్యే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత విషయాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఏమరుపాటుగా ఉండవద్దని, సోషల్‌మీడియా అకౌంట్స్‌కి తప్పనిసరిగా ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలన్నారు.

నేడు రెండు గ్రామాల్లో 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'..

ఇల్లంతకుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్, ఒగులాపూర్ గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాలు ఉంటాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రహీంఖాన్‌పేట గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్న అనంతరం వెల్జీపూర్ గ్రామంలో సీసీరోడ్డు, అంగన్‌వాడీ కేంద్ర భవనానికి భూమిపూజ చేస్తారని, అన్ని గ్రామాల నాయకులు హాజరుకావాలని కోరారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్‌లో తమ సమస్యలు తెలిపితే సత్వరమే పరిష్కారం అవుతాయని తెలిపారు.

ఆయకట్టు కాలువలో అక్రమ కట్టడం కూల్చివేత

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని ఆయకట్టు కాలువను కొందరు ఆక్రమించుకుని నిర్మించిన బేస్మెంట్‌ను నీటి పారుదల శాఖ ఏఈ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలోని సిబ్బంది కూల్చివేశారు. ఆయకట్టు కాలువను కబ్జాచేసి చేపట్టిన నిర్మాణంపై ఈనెల 5న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'దర్జాగా ఆయకట్టు కాలువ కబ్జా' కథనానికి ఏఈ వెంకట్‌రెడ్డి మంగళవారం స్పందించారు. క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించారు. కాలువలో చేపట్టిన నిర్మాణాన్ని తొలగించారు. ఆయకట్టు కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఏఈ హెచ్చరించారు.

అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవం రోజు కేంద్ర హోం శాఖ అందించే అశోక చక్ర అవార్డు కోసం పోలీసులు దరఖాస్తుల సమర్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణలో సాహసోపేతంగా వ్యవహరించిన పోలీసు అధికారులకు కేంద్ర హోంశాఖ అవార్డులు అందిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎస్పీకి దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వేములవాడ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర స్వామి ఆలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కూరగాయల శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా చంద్రగిరి శరత్, వి.వి రామ్ కిషన్‌రావు, వాసాలమర్రి గోపి, పెంట శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా వంశీ మోహన్, కోశాధికారిగా గట్టు గౌతం, సహాయకార్యదర్శులుగా పూజిత, సుశీల్, టి సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బొడును మహేష్, ప్రచారకార్యదర్శిగా సగ్గు దిలీప్, గౌరవ సలహాదారులుగా బ్రహ్మన్నగారి శ్రీనివాస్, వెల్ది సంతోష్, కే వెంకటయ్య, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

చందుర్తి మే 6 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్‌లో బీరప్ప ఉత్సవాల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొని మంగళవార ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యుడు నాగం కుమార్, ఏఎంసీ వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, భీమరాజు కనకరాజు, ముసుకు ముకుంద రెడ్డి, మ్యాకల గణేష్, ఇందూరి మధు, నాగుల శంకరయ్య, మర్రి కృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మ్యాకల పరశురాములు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరుట్ల రమేష్, నాగారం కొమరవ్వ, అరుణ్ తేజా చారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నీరజ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ

సిరిసిల్ల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ పి. నీరజ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కోర్టుహాలులో జూన్ 9 నుంచి 14వరకు నిర్వహించే ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పోలీసు అధికారులు, జ్యూడిషియల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అత్యధిక కేసుల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రధానంగా ఎన్ఐ యాక్ట్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులతో పాటు రాజీ అయ్యే క్రిమినల్, సివిల్ కేసుల పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందుకు పోలీసు, జ్యూడిషియల్ అధికారులు సమన్వయంతో కృషి చేస్తే పరిష్కార మార్గానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా ఉండేందుకు చివరికి రాజీయే రాజమార్గం అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్, సృజన, మేఘన, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, ఆడెపు వేణు, పీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉద్యోగులపై సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : టీపీటీఎఫ్

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కించపర్చేలా తెలంగాణ ప్రజలను ఢిల్లీలో దొంగలుగా చూస్తున్నారని, ఉద్యోగులు ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడాన్ని టీపీటీఎఫ్ ఖండిస్తోందని జిల్లా అధ్యక్షుడు దుమాల రాంనాథ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాంనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను డిమాండ్లుగా చేసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నాయని, ప్రభుత్వం గత 15 నెలలుగా అనేకసార్లు ఉద్యోగ జేఏసీతో చర్చలు జరిపి పరిష్కరిస్తామని చెప్పి ఉద్యోగులకు మొండి చేయి చూపడం సరైంది కాదన్నారు. ఉద్యోగ జేఏసీ ప్రభుత్వం ముందు పెట్టిన 57 డిమాండ్లలో సుమారు 40 డిమాండ్లను పరిష్కారానికి ప్రభుత్వం వేసిన మంత్రుల ఉప కమిటీ పేరుకే మిగిలిపోయిందన్నారు. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సత్తు రవీందర్, హన్మాండ్లు, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, నూగూరి దేవేందర్, మైలారం తిరుపతి, బొజ్జ కృష్ణ, శ్రీనివాస్, దూస సంతోష్, మధుసూధన్, సకినాల భాస్కర్‌లు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రాంనాథ్‌రెడ్డి

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అభినందించారు. తన ఛాంబర్‌లో అంబేద్కర్‌నగర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు గుండ్లపెల్లి వరుణ్, చిప్ప మేఘన, కైరంకొండ శ్వేత, సిరిమల్ల అక్షయశ్రీ, యెన్నం అమృత్ సాగర్‌లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అభినందించారు. ఫలితాలకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు కులాసా మల్లేశంతోపాటు ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గూడూరు రవికుమార్, పర్కాల రవిందర్, జంగిటి భానుచందర్ పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

వేములవాడ రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన నూకల మర్రి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులను రోమాల లక్ష్మణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, ఫౌండేషన్ అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, వేములవాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పరశురాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులు సంపత్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్య

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రగతికి నిలయాలనీ, ఉచిత మెరుగైన విద్య అందించి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామనీ ప్రభుత్వ విద్యాలయాల్లో చదివిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమనీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో మంగళవారం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డీఐఈవో శ్రీనివాస్ బహుమతులు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. వనజకుమారి, ఉపన్యాసకులు వాసరవేణి పర్శరాములు, క్యాతం సత్యనారాయణ, మాదాసు చంద్రమౌళి, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్, అనుముల రవిచంద్ర, వెల్దండి సౌమ్య, ఆగోలం గౌతమి, సాగర్, తాజోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లి కర్కశత్వం

- ప్రియుడితో కలిసి 15 రోజులుగా కుమారుడిపై దాడి
- చికిత్స పొందుతూ బాలుడి మృతి


అరుష్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి, ఆమె ప్రియుడి కర్క శత్వానికి ఐదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన మంగళారపు అరుష్(5) అనే బాలుడు తల్లి, ఆమె ప్రియుడు కొట్టిన దెబ్బలకు స్పృహతప్పి పడిపోగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన మంగళారపు మాధవి, అరుణ్‌కుమార్‌లకు అరుష్(5), ఎనిమిదేళ్ల కూతురు ఉన్నారు. మాధవి భర్త అరుణ్‌కుమార్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం కిడ్నీలు ఫెయిలై మృతిచెందాడు. బీడీ కార్మికురాలిగా పనిచేసే మాధవి కొంత కాలంగా ఓ మెడికల్ షాప్‌లో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తోంది. నాలుగు నెలల క్రితం అదే మెడికల్ షాప్‌లో పనిచేసే సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో ఉంటున్న సామాల బాలకిషన్‌తో పరిచయం ఏర్పడింది. ఇటీవలనే ఇద్దరు పిల్లలతో కలిసి మాధవి సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలోని అద్దె ఇంట్లోకి మకాం మార్చింది. తల్లి మాధవి, ఆమె ప్రియుడు బాలకిషన్‌లు 15 రోజులుగా కుమారుడు అరుష్(5)పై దాడిచేసి కొడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాలుడు అరుష్ తలకు గాయమై స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో తల్లి, ఆమె ప్రియుడు ఇద్దరు కలిసి స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించినప్పటికీ బాలుడు స్పృహలోకి రాకపోవడంతో పరిస్థితి విషమించిందని వైద్యులు తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. బాలుడి తాత లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేశ్ బి గితె

సిరిసిల్ల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న సిరిసిల్ల పట్టణానికి చెందిన మహ్మద్ అహ్మద్(23) అనే యువకుడిని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేశ్ బి. గితె తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లకు చెందిన అహ్మద్‌పై 15 గంజాయి కేసులు నమోదయ్యాయని, 5 కేసుల్లో పరారీలో ఉన్నాడన్నారు. జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, బోయిన్‌పల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్లలో నమోదైన 15కేసుల్లో సిరిసిల్ల టౌన్‌లో 4, చందుర్తిలో 1 కేసులో పరారీలో ఉన్నాడన్నారు. దీంతో అహ్మద్ సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ చౌరస్తా వద్ద ఉన్నట్లు తెలుసుకున్న టౌన్ సీఐ కె. కృష్ణ వెళ్లి అరెస్ట్‌చేసి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అరికట్టడానికి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించినా, సాగుచేసినా, అక్రమ రవాణా చేసినా 8712656392కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

గంగాధర, మే 6 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం ఆచంపల్లిలో 12 ట్రాక్టర్ల ఇసుక డంపులను గుర్తించినట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. గ్రామంలో అక్రమంగా ఇసుక డంపు చేసినట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా 12 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గుర్తించినట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

అరచేతిలో ఆర్టీసీ సేవలు

క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో అందుబాటులోకి



ఆర్టీసీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యూఆర్‌కోడ్ కీచైన్‌లు

భగత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు చేరువయ్యేందుకు పలు సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యాప్‌ల ద్వారా ప్రయాణికులు ఈ సేవలు పొందవచ్చు.

కొత్త తరహాలో..

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక క్యూఆర్ కోడ్ రూపొందించింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే పలు రకాల యాప్‌ల ద్వారా ఆర్టీసీ సేవలు వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ బస్ బుకింగ్, టికెట్ బుకింగ్, గమ్యం, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్ యాప్‌లు ఉంటాయి. గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్‌కు ఆండ్రాయిడ్, ఐవోఎస్ వినియోగదారులకు ఉపయోగపడేలా వేర్వేరు యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో ప్రయాణికుల వివరాలు పొందుపరిస్తే ఆర్టీసీ సేవలు వినియోగించుకోవచ్చు.

సేవల వివరాలు...

మనం ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుందో, మన వాళ్లు వస్తున్న బస్సు ఎక్కడి వరకు వచ్చిందో, ఎంత సమయం పట్టవచ్చు, గమ్యస్థానం ఎంత సేపటిలో చేరుతారో గమ్యం యాప్ ద్వారా తెలుసు కోవచ్చు. రాష్ట్రంలో నడుస్తున్న బస్సుల వివరాలు, సమాచారాన్ని సైతం అందుబాటులో ఉంచారు. సలహాలు సూచనలే కాకుండా ఆన్‌లైన్‌లో మనకు కావాల్సిన చోటుకి టికెట్స్ రిజర్వు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నది. ఆర్టీసీ సేవలపై ఎలాంటి ఫిర్యాదులున్నా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వివాహాది శుభకార్యాలతో పాటు విహార యాత్రలకు బస్సులను రాయితీ విధానంలో యాప్‌ల ద్వారా తక్కువ ధరకే బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నది.

ఆర్టీసీని ఆదరించండి
బి రాజు, రీజినల్ మేనేజర్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు ప్రయాణీకులకు మరింత చేరువయ్యే విధంగా క్యూఆర్ కోడ్ రూపకల్పన చేసింది. ప్రయాణీకులు కీ చైన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీ సమాచారం అందుబాటులోకి వస్తుంది. యాప్‌ల ద్వారా అందిస్తున్న ఆర్టీసీ సేవలను ప్రయాణికులు వినియోగించుకుని ఆర్టీసీ ఆదరించాలి.

కీ చైన్‌ల ద్వారా ప్రచారం...

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌లు ముద్రించిన కీ చైన్‌లను తయారు చేసింది. కీ చైన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆర్టీసీ సేవలన్నీ అందుబాటులోకి వస్తాయి. కీచైన్‌లను ప్రయాణీకులకు వివిధ రూపాల్లో అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

రైలు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

ఓదెల, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్ గేటు సమీపంలో మంగళవారం రైలు ఢీకొని ఇదే గ్రామానికి చెందిన కాంతాల లక్ష్మి (70) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో ఉన్న బంధువుల ఇంటికి బస్సులో వెళ్లేందుకు రైల్వేలైన్ దాటుతోంది. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో లక్ష్మి మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్‌పి. హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

కాట్రపల్లిలో ఎలుగుబంటి సంచారం

హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఎలుబంటి సంచారంతో గ్రామస్థులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామ శివారులోని కుందేళ్ల గుట్ట సమీపంలో ఎలుగుబంటి పిల్లలతో సంచరిస్తూ మంగళవారం గ్రామస్థులకు కంటపడటంతో వారు వెంటనే పరుగులు పెట్టారు. ఎలుగుబంటి సంచరిస్తుండటంతో గ్రామస్థులు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎలుగుబంటి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ తొగరు భిక్షపతి, బిట్ల శ్రీకాంత్, గ్రామస్థులు కోరుతున్నారు.

పాతకక్షలతో దాడి

జగిత్యాలరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బాల ముకుందంపై పాతకక్షలు మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ముద్దసాని గంగాధర్ కర్రతో దాడిచేసి గాయపరిచినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బాలముకుందంకు, ముద్దసాని గంగాధర్‌లకు గత కొన్ని రోజులుగా గ్రామ అభివృద్ధితో పాటుగా గ్రామ కంఠం, రోడ్డునిర్మాణాలకు సంబంధించి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో బాలముకుందంపై కోపం పెంచుకున్న ముద్దసాని గంగాధర్ మంగళవారం ఉదయం సమయంలో గ్రామ పంచాయితీవద్ద ఉన్న బాలముకందంపై వెనుకవైపు నుంచి కర్రతో దాడిచేసి గాయపర్చాడు. తీవ్రగాయాలైన బాలముకుందంను జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వెనుకవైపు వెన్నుభాగం లోపల బలమైన గాయాలు కాగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆస్పత్రిలో బాలముకుందంను పరామర్శించారు. కారణాలను తెలుసుకున్నారు.

ఐదుగురిపై అదనపు కట్నం కేసు

జమ్మికుంట రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం అత్తింటి వారు వేదిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన గాజనేని రవళికి ఇల్లందకుంట మండలం రాచపల్లికి చెందిన ఉమ్మనవేణి మహేష్‌కు గత ఏడాది ఫిబ్రవరి 11న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఐదు లక్షల నగదు, తొమ్మిది తులాల బంగారం, ఇతర పెట్టుపోతలతో ఘణంగా పెళ్లి జరిపించారు. రెండు నెలలు బాగానే ఉన్న మహేష్ తరుచూ మద్యం సేవిస్తూ అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టాడు. భర్తతో పాటు అత్త ప్రమీల, మామ మల్లయ్య, ఆడపడుచు మౌనిక, ఆమె భర్త మల్లేష్ సైతం వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

రియల్ ఎస్టేట్ పేరుతో రూ.93లక్షల మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ ● కేసు నమోదు

జమ్మికుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో రియల్ ఎస్టేట్ పేరుతో ఓ మహిళ వద్ద రూ.93లక్షలు తీసుకు ని మోసం చేసిన ఓ వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మి కుంటకు చెందిన పోనగంటి కావ్యకు అదే జమ్మికుంటకు చెందిన మ్యానకొండ సాయి కిరణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పరిచయం అయ్యాడు. తక్కువ ధరకు ప్లాట్లు, భూమి ఇప్పిస్తానని చెప్పి విడతల వారీగా రూ.93 లక్షలు తీసుకున్నాడు. ప్లాట్, భూమి ఎక్కడ అని అడిగితే ఇన్ని రోజులు దాటవేసుకుంటూ వచ్చాడు. లాభం లేదని గ్రహించిన సదరు మహిళ గట్టిగా నిలదీయడంతో నీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

అగ్నిప్రమాదంలో వరి ధాన్యం దగ్ధం

మంథనిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెంద గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరెపల్లి సాంబయ్య అనే రైతుకు చెందిన వరి పంట కుప్ప దగ్ధమైంది. మూడున్నర ఎకరాల్లో సాంబయ్య మేల్, ఫిమేల్ సాగు చేశాడు. చేతికి వచ్చిన పంటను కోసి కల్లంలో కుప్ప వేయగా మంటలు అంటుకున్నాయి. విషయాన్ని మంథని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ శివశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్ప టికే పంట దగ్ధమైంది. సుమారు రూ.5 లక్షల వరకు పంట నష్టం జరినట్లు అంచనా వేస్తున్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని హుస్సేన్‌మియా వాగు పరివాహక ప్రాంతంలోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు అంటించారు. దీంతో రైతు జంగా రాజయ్యకు చెంది న ఎకరం 10గుంటల బాస్మతి వరికుప్ప, కొరకండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 28గుంటల బాస్మతి వరికుప్ప కాలి బూడిదైంది. వరి కొయ్యకాలు కాలబెట్టడం వలన పక్కనే ఉన్న వరి పొలానికి మంటలు అంటు కోవడంతో చుట్టుపక్కల రైతులు ఆర్పివేశారు.


ఆరెందలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మండల కేంద్రంలో హుస్సేన్‌మియావాగు పక్కన యరబాటి రాజేశ్వర్‌రావుకు చెందిన మూడు ఎక రాల ఆయిల్ పామ్ తోట అగ్నికి ఆహుతైంది. మంగ ళవారం గుర్తుతెలియని రైతులు కోసిన వరిపొలం కొయ్యకాలు తగలబెట్టడంతో మంటలు వ్యాపించి ఆయిల్‌పామ్ తోటతోపాటు డ్రిప్పు కూడా కాలి పోయింది. రూ. 40వేల నష్టం జరిగింది.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

మెట్‌పల్లి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి రూరల్ మండలంలోని వెల్లుల్ల, రామచంద్రంపేట గ్రామాల్లో తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో సోమవారం రాత్రి చోరీలు జరిగాయి. మంగళవారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రంపేటలోని అల్లిక సంజన అనే వివాహిత నెల రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో మంగళవారం ఉదయం పక్కింటి వారు ఫోన్ ద్వారా ఆమెకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూసేసరికి రూ.4వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామంలోని పుల్లూరి గంగమణి ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో సమాచారం అందుకొని వచ్చి చూసేసరికి ఇంట్లోని రూ.10వేలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన బొడ్డు లింగాధర్, పెండం నరేందర్ కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం తిరుపతి టూర్ వెళ్లారు. వారి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి ఉండేసరికి పక్కింటి వారు సమాచారం అందించారు. బాధితుల బంధువులు చూసేసరికి పెండం నరేందర్ ఇంట్లో రూ.10వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. సీఐ అనిల్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేములవాడ : వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్ లోని తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. స్థానికంగా ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్న తాటికొండ సంతోష్ కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలను సేకరించారు. సుమారు 25 వేల నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

అభివృద్ధి పేరుతో రాజన్న ఆలయాన్ని మూసివేయడం సరికాదు

వేములవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పేరిట జూన్ నెల నుంచి మూసివేయాలని అధికారులు నిర్ణయించడం సరికాదని వేములవాడకు చెందిన పలువురు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం దేవస్థానాన్ని జూన్ 15 నుంచి మూసివేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం పద్మశాలి సంఘం భవనంలో వివిధ వర్గాలకు చెందిన పలువురు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాజన్న రక్షణ సమితి ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అభివృద్ధి పేరిట దేవాలయాన్ని మూసివేయాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీన వేములవాడ బంద్ పాటించాలని నిర్ణయించారు. అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో ఆలయాన్ని మూసివేస్తాం అంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న అనుబంధ ఆలయాలను తొలగించినా ఊరుకొనేది లేదన్నారు. రాజన్న ఆలయం ఆగమశాస్త్రం ప్రకారం లేదని అధికారులు చెబుతున్నారని, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ఆవరణలో దర్గా ఉండవచ్చా అని ప్రశ్నించారు. కేవలం 76 కోట్ల రూపాయలతో మాత్రమే పనులు పూర్తవుతాయా అని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం రాజన్న ఆలయాన్ని మూసివేస్తారని ప్రచారం జరగడంతో స్థానికులతో పాటు భక్తులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉజ్జయిని, కాశీ, అయోధ్య లాంటి ఆలయాలు మూసి వేయకుండానే అభివృద్ధి చేశారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

ఇదిలా ఉండగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశిస్తూ ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నాడని, ఇట్లాంటి పరిస్థితుల్లో అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేయడం సరైనది కాదని అన్నారు. వేములవాడ రాజ న్న రక్షణ సమితి చేసే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటానని బండి సంజయ్ కుమార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయ కుడు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, కుమ్మరి శంకర్, సంటి అంజిబాబు, రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు, మోటూరి మధుసూదన్, పిన్నింటి హనుమాన్లు, కటకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్రం మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సిరిసిల్లలో సీపీఐ పట్టణ మహాసభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవనంలో మంగళవారం పట్టణ మహాసభలను సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవిల ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ మహిళా నాయకురాలు సుంకరపెల్లి శాంతాబాయ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలకు ముఖ్యఅతిథిగా జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎంలో పని చేసిన ఏలిగేటి రాజశేఖర్, షకీల్‌తోపాటు ఎనిమిది మంది నాయకులు చాడ వెంకట్‌రెడ్డి సమక్షంలో సీపీఐలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, సీపీఐ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఎర్రజెండా కార్మికుల పోరాటాలు, ఆవేదన కష్టాల నుంచి పుట్టిన జెండా ఎర్ర జెండా అన్నారు. 1925లో పరిపాలన వలసవాదులైన నైజాం పాలకుల చేతిలో ఉండేదని, అప్పుడు ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ హక్కులు ఏమీలేవన్నారు. ఆనాటి దుస్థితి నుంచి తెలంగాణలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దూం మోయిన్, తెలంగాణ సాయుధ పోరాటం చేసి నైజాం పాలకులను గద్దెదించిన చరిత్ర అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం లేకపోతే నైజాం గద్దె దిగేవాడే కాదని ఇది ముమ్మాటికీ వాస్తవం అని అన్నారు. అలాంటి పోరాటంలో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ఉండడం గర్వకారణం అన్నారు. ఇప్పటికీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆగడాలని పెంచి పోషిస్తూ హిందూ దేశమని ముద్ర వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. భారతదేశంలో విభిన్న మతాలు సంస్కృతులు సంప్రదాయాలు, భాషలు భావాలు నిలయంగా ఉన్న దేశం అన్నారు. కార్మికులు పోరాటం చేసి 44 చట్టాలను సాధించుకుంటే కార్మికులు సమ్మె చేసే హక్కును హరిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తిగా కాలేదని, అంగన్‌వాడీలకు, ఆశాలకు, మధ్యాహ్నం భోజనం కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై కార్మిక సంఘాలు పోరాటం చేయడానికి సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. మహాసభల్లో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మీసం లక్ష్మణ్, అనసూర్య, కుర్ర రాకేష్, కేవి అనసూయ, అజ్జ వేణు పాల్గొన్నారు

ఆస్తిలో వాటా కోసం ఆందోళన


జఫరోద్దీన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

జగిత్యాల అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): అత్తగారి పేరు మీద ఉన్న ఆస్తిని తన మామ ముగ్గురు కూతుళ్లు ఉండగా రెండో కూతురు పేరున రిజిస్ట్రేషన్ చేశారని జగిత్యాల మున్సిపల్‌లో ఆందోళనకు దిగిన ఓ యువకుడు తలను బీరువాకేసి కొట్టుకోవడంతో స్పృహ కోల్పోయాడు. వివరాలలోకి వెళితే..జగిత్యాలకు చెందిన అఫ్సరీ బేగం అహ్మద్‌ఖాన్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అఫ్సరీ బేగం మరణించగా ఆమె భర్త అహ్మద్‌ఖాన్ తన భార్య పేరుపై ఉన్న ఆస్తిని రెండో కూతురుకు రిజిస్ట్రేషన్ చేశాడు. దీనిపై అహ్మద్‌ఖాన్ అల్లుడు జఫరోద్దీన్ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆందోళన చేపట్టాడు. తలను బీరువాకు కొట్టుకోవడంతో స్రృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న మున్సిపల్ సిబ్బంది వెంటనే జఫరోద్దీన్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

నెలలోపే మహిళా కమిషన్ ఫిర్యాదుల పరిష్కారం

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద


కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద దంపతులు

మల్యాల, మే 6(ఆంధ్రజ్యోతి): మహిళా కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులను నెల రోజులలోపే పరిష్కారం చేసే దిశగా ముందుకు వెళ్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైరపర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. మంగళవారం కొండగట్టు అంజనేయ స్వామిని కుటుంబసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో కన్న ఇప్పుడు కమిషన్‌కు ఫిర్యాదులు పెరిగిపోయాయని వాటికి కౌన్సెలింగ్ ఇస్తూ పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సహజీవనం ఫిర్యాదులు అనేకం వస్తున్నాయన్నారు. ఆకర్షణ, ప్రేమ తదితర కారణాలతో సహజీవనం చేయడం సమాజానికి, వ్యక్తిగతంగా మంచిది కాదన్నారు. ఇటీవల మగవాళ్ల వైపు నుంచి కూడా ఫిర్యాదులు వస్తుండడంతో వాటికి కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు నేరెళ్ల శారద పేర్కొన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధిపై చర్చిస్తాం

కొండగట్టు ఆలయం అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించనున్నట్లు నేరెళ్ల శారద అన్నారు. కొండగట్టు ఆలయ అభివృద్ధి, వసతి తదితర సౌకర్యాల కోసం ప్రభుత్వం తరుపున కృషి చేస్తామని తెలిపారు. టీటీడీ వంద గదుల నిర్మాణంపై ఏపీ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతామని శారద పేర్కొన్నారు.

భూసేకరణ పనులు
వేగంగా చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- 80 అడుగుల మేరకు రోడ్డు వెడల్పు
- ఆందోళనకు దిగిన నిర్వాసితులు



వేములవాడలో భూ సేకరణ సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మూల వాగు నుంచి రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ కోసం భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణకు సంబంధించిన భూసేకరణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పునకు 50ఏళ్లుగా ఆటంకాలు ఎదురవుతున్నాయని, అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని, ఈసారి ఖచ్చితంగా 80 ఫీట్ల మేరకు రోడ్డును విస్తరించి తీరుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్డు వెడల్పులో నష్టపోయే ఇళ్ల యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు 47కోట్ల 80 లక్షల రూపాయలు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. రోడ్డు వెడల్పు నిర్వాసితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని, నష్టపరిహారం కింద గజానికి 30వేల రూపాయలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు.

80 ఫీట్ల మేరకు రోడ్డును విస్తరించేందుకు రోడ్డుకు మార్కింగ్ జరుగుతోందని, ఈమేరకు 315 ఇళ్లలో 257 ఇళ్లకు సంబంధించిన సర్వేను ఇంజనీరింగ్ అధికారులతో కూడిన నాలుగు బృందాలు పూర్తిచేశాయని, మిగతా సర్వే వేగంగా పూర్తి చేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ చట్టం 2013 సెక్షన్ 12 ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు తమకు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని వారంలో మొత్తం భూ సేకరణ సర్వే పొరపాట్లు జరగకుండా పూర్తిచేసి ప్రతిపాదనలు అందిస్తే వెంటనే అవార్డులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, మున్సిపల్, ఆర్అండ్బీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. రోడ్డు వెడల్పునకు సంబంధించిన సర్వే నిర్వహించకుండా హైకోర్టు స్టే మంజూరు చేసిందంటూ పలువురు ఇళ్ల యజమానులు అధికారులను అడ్డుకున్నారు. అయితే హైకోర్టు కేవలం నాలుగు ఇళ్లకు సంబంధించి మాత్రమే ఆదేశాలు జారీ చేసిందని, మిగతా ఇళ్లకు సంబంధించిన సర్వేను పూర్తిచేస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో రోడ్ల వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళనకు దిగారు.



రాజన్న ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఇళ్ల యజమానులు

మదర్ ఆఫ్ గేమ్స్.. అథ్లెటిక్స్

రన్, త్రో, జంప్, వాక్‌ల కలయిక

నేడు వరల్డ్ అథ్లెటిక్స్ డే









కరీంనగర్ స్పోర్ట్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌ను మదర్ ఆఫ్ గేమ్స్ అని కూడా పిలుస్తారు. వ్యక్తిలోని శక్తి సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఇందులోని అంశాలు వేదికగా నిలుస్తాయి. ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్‌కు ప్రత్యేక గుర్తింపు. అథ్లెటిక్స్‌లోని రన్, త్రో, వాక్, జంప్ వంటి ఆటలు వ్యక్తి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయి. మనిషి ఆరోగ్యంగా ఉంటే ప్రపంచం ఆరోగ్యంగా ఉంటుందనే నానుడిని నిజం చేయాలని 1996లో తొలిసారిగా ప్రపంచ అథ్లెటిక్స్ డేను ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ప్రారంభించింది.

చిన్నాపెద్ద వయోభేదం లేకుండా సర్వ మానవాళి ఆరోగ్యంగా ఉండాలనేది ప్రపంచ అథ్లెటిక్స్ డే ప్రధాన లక్ష్యం. అథ్లెటిక్స్ ఫర్ ఏ బెటర్ వరల్డ్ అనేది ఐఏఏఎఫ్ ప్రధాన నినాదం. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, యువత క్రీడల్లో పాల్గొన డానికి, ఫిట్‌నెస్ ముఖ్యం. ఇందులో భాగం గా ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ఏటా మే 7వ తేదీన ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్‌లో పాల్గొనేలా యువతను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రాథమిక లక్ష్యం.

అథ్లెటిక్స్‌లో రాణించాలంటే

శారీరక దారుఢ్యానికి తోడు నిర్దిష్టమైన ఎత్తు, బరువు ఉన్న విద్యార్థులు, యువత అథ్లెటిక్స్‌లో రాణిస్తారు. 12 ఏళ్ల వయస్సు నుంచి శిక్షణ మొదలుపెడితే భవిష్యత్‌లో రాణించ గలుగుతారు. శిక్షణకంటే ముందు విద్యార్థుల శరీరాకృతి, శక్తి సామర్థ్యాలను అంచనావేసి ఏ అంశానికి సరిపోతారన్నది గుర్తించాలి. ఇందుకు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలి. ధృఢమైన శరీరం గలవారు స్ప్రింటర్లుగా, ఎత్తుగా ఉండి ఛాతి లోపలికి ఉన్నవారు లాంగ్ డిస్టెన్స్ రన్నర్స్‌గా, బల ప్రదర్శనలో ముందుండేవారు త్రోలో రాణిస్తారు.

అథ్లెటిక్స్‌లోని అంశాలు

పరుగు: 100, 200, 400 మీటర్ల షార్ట్ డిస్టెన్స్ రన్, 800, 1500 మీటర్ల మిడిల్ డిస్టెన్స్ రన్, 3000 మీటర్ల స్టిపుల్ చెస్ పరుగు.

త్రోస్: జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హ్యామర్ త్రో.

జంప్: హైజంప్, లాంగ్ జంప్, పోల్ వాల్ట్, ట్రిపుల్ జంప్.

కంబైన్డ్ అంశాలు: ట్రైయాతలాన్, పెంటతలాన్, హెప్టాథ్లాన్, డెకథ్లాన్.

జిల్లాలో ఆదరణ

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అథ్లెటిక్స్ ఆదరణ ఉంది. కరీంనగర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నందెల్లి మహిపాల్, కడారి రవి వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో ఏటా అథ్లెటిక్స్ పోటీలను జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలోని రుక్మాపూర్, జమ్మికుంట, హుజూరాబాద్, మేడిపల్లి, కోహెడ, హుస్నాబాద్, కరీంనగర్, శనిగరం, గంగాధర, దాచారం, చొప్పదండి, చింతకుంట, మానకొండూర్ తదితర ప్రాంతాల నుంచి ఎందరో అథ్లెటిక్‌లు వెలుగులోకి వచ్చారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు.



వ్యాయామ ఉపాధ్యాయులుగా

గతంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన కడారి రవి, శ్రీనివాస్, డి.శ్రీనివాస్, హరికిషన్, కె.సమ్మయ్య, చంద్రశేఖర్, బాబు శ్రీనివాస్, బి.రాజగోపాల్ చారి, డాక్టర్ ఇజాజ్ అహ్మద్ వ్యాయామ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. వీరి ఆధ్వర్యంలో నూతన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు.

జిల్లాలో అథ్లెటిక్స్ అభివృద్ధికి కృషి

నందెల్లి మహిపాల్, అథ్లెటిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు



జిల్లాలో అథ్లెటిక్స్‌కు విశేష ఆదరణ లభిస్తుంది. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభచాటుతున్నారు. పలు ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. జిల్లాలో అథ్లెటిక్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు భత్యాలతోపాటు క్రీడా దుస్తులను అందిస్తున్నాం. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాం.

సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి

కడారి రవి, అథ్లెటిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



జిల్లాలో అథ్లెటిక్స్ నిర్వహణకు అంబేద్కర్ స్టేడియంలోని మైదానంలో సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసినా దూరంగా ఉండడంతో నగర క్రీడాకారులు ఆ ట్రాక్‌పై శిక్షణ పొందేందుకు కష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నా స్పాన్సర్ అవసరం ఉంది. జిల్లా అథ్లెట్స్ ఆర్మీ, రైల్వే, పోలీస్ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు.

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

మల్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఇరవై వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. జైజంక్షన్, పార్కింగ్ ప్రాంతంలో సరైన ఏర్పాట్లు చేయక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

కూలిన చలువ పందిళ్లు

కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కోనేరు పక్క నుంచి పాత కార్యాలయానికి వెళ్లే మార్గంలో చలువపందిళ్ల కూలి భక్తులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి వీచిన గాలి దుమారానికి పం దిళ్ల పడిపోగా వాటి కింద పడుకున్న భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మంగళవారం వేలాదిగా భక్తులు తరలి వస్తారని తెలిసీ కూలిన పందిళ్లను కనీసం సరిచేయించకపోవడం పట్ల భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తులు

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో భక్తులు ఊరేగింపుగా బద్ది పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. పట్నాలు వేసి అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. అనంతరం నైవేద్యం, కళ్లసాక పెడుతూ పిల్లపాపలు, పాడి పంటలను చల్లంగా చూడమ్మ బద్దిపోచమ్మ తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బద్దిపోచమ్మ ఆలయం లోపల భక్తులు

బహుముఖ ప్రజ్ఞాశాలి స్వామి



పాట రికార్డింగ్‌లో కవ్వంపల్లి స్వామి

- రచయిత, నటుడు, గాయకుడిగా రాణింపు
- సింగరేణిలో పదవీ విరమణ
- ప్రజా పాటల ప్రస్థానానికి అర్ధశతాబ్దం



దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తితో స్వామి

కోల్‌సిటీటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): రచయితగా, నటుడిగా, గాయకుడిగా సింగరేణి కార్మిక క్షేత్రంలో రాణిస్తున్నాడు కవ్వంపల్లి స్వామి. అర్ధశతాబ్దంగా కళారంగంలో, ఉద్యమాల్లో తన కలంతో పాటలకు ప్రాణం పోశాడు. ప్రజా నాట్యమండలి కళాకారుడిగా ప్రజల్లో, కార్మికుల్లో చెరగని ముద్ర వేసున్నాడు స్వామి.

గోదావరిఖనికి చెందిన కవ్వంపల్లి స్వామి బహుముఖ ప్రజ్ఞతో యాభైఏళ్ళుగా ప్రజా కళాకారుడిగా సేవలందిస్తున్నారు. స్వగ్రామం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు. స్వామి తండ్రి వెంకటయ్య సింగరేణి కార్మికుడు కావడంతో గోదావరిఖనిలోనే స్వామి విద్యాభ్యాసం సాగింది. అనంతరం సింగరేణిలో క్యాజువల్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూనే కళాకారుడిగా తన గళాన్ని వినిపించాడు. స్పెషల్ గ్రేడ్ క్లర్క్‌గా 2019లో పదవీవిరమణ చేశారు. విద్యార్థి దశ నుంచి అప్పటి కార్మిక నాయకుడు దివంగత మాదిరెడ్డి భాస్కర్‌రావు ప్రోత్సాహంతో 1973లో ప్రజా నాట్యమండలిలో చేరాడు.

1974లో విజయవాడలో జరిగిన రాష్ట్ర మహాసభలకు హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచి సీపీఐ-ప్రజా సంఘాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పదవులు నిర్వహించి ప్రస్తుతం ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ సమితి సభ్యుడిగా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజా గాయక బృందంలో ప్రధాన గాయకుడు స్వామి. నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు శిక్షణా శిబిరాలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహించాడు. నాటి సినీనటులు సి.నాగభూషణం, నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల ప్రతాపరెడ్డిల నాయకత్వంలో వందేమాతం శ్రీనివాస్‌తో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అక్కో అక్కో అక్కా... సూడు మల్లేశా..., ఏమి రాజ్యం ఎన్నియల్లో, కూలినాలీ నాలన్నలారా, సింగరేణి కార్మికా వంటి గీతాలు స్వామి కలం, గొంతు నుంచే జాలువారినవే. కళా ప్రదర్శనల్లోనే కాకుండా క్యాసెట్లు, సిడిల్లో స్వామి పాటలు రికార్డయ్యాయి. 1978లో ఆలిండియా రేడియో కార్మికుల కార్యక్రమంలో స్వామి పాటలు ప్రసారమయ్యాయి. కోలిండియా స్థాయిలో 25సార్లు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అందరి మన్ననలు అందుకున్నారు. గీత్, భజన్ ఈవెంట్లలో బహుమతులు పొంది సింగరేణికి ఖ్యాతిని తీసుకువచ్చారు. ప్రజాకవి వంగపండు రాసిన భూబాగోతం, నృత్యనాటికకు నేపథ్యగానం అందించారు. ఈ నృత్య నాటికను 1982లో దాదర్, వర్లీ(బొంబాయి)లోని తెలుగు ప్రజల మధ్య ప్రదర్శించారు.

అంతా ఒక్కటే, ఉక్కుపిడికిళ్ళు తూర్పు వంటి రంగస్థల నాటికలతో పాటు వీధినాటికలు కాలేరోళ్ళు, సీసపద్యం మొదలైన వాటిలో ప్రదర్శించడంతోపాటు వీటిలో నటించడం ద్వారా స్వామికి గుర్తింపును తీసుకువచ్చాయి.

రచయితగా రాసిన గేయాల్లో కొన్ని...

- నేలతల్లినే నమ్ముకొని రైతన్నా...
- బిరబిర బీడీలు చుట్టే ఓ అక్కా...
- నల్లా బంగారానికి నష్టమెట్లవచ్చెరా...
- వీధుల వెంట ....రమేషా...సురేషా...
- ఎడారి దేశంలో నీబతుకు ఎడారే తమ్మీ...
- మల్లెపల్లి రాజమా... పల్లె ఎర్రమల్లెవు...
- సిరిసంపదలు గల్ల సిరిసిల్ల పట్నంలో...
- జొన్నల మల్యాల బిడ్డ జోహార్లు బానయ్య

" వీధుల వెంట...గల్లీ పొంట రమేషా... సురేషా అనే పాట జోష్ సినిమాకి జోష్ నిచ్చింది.

2012లో తెలంగాణ కోసం గద్దర్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకత్వాన సాగిన గోలేటి నుంచి కొత్తగూడెం వరకు బాయి నుంచి బాయికి కార్యక్రమంలో 15 రోజుల పాటు సాంస్కృతిక దళానికి స్వామి నాయకత్వం వహించారు.

పాటకు పర్యాయపదంగా...

రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సీడీల్లో స్వామి పాటలు దేశం కోసం, ఎర్రజెండా నీడలో, రణభేరి, ఢంకానాదం, ఎర్రకుంకుమ మొదలైన క్యాసెట్లు(సీడీలు)లో స్వామిగళమెత్తారు. కాలేరోళ్ళు, సీసపద్యం నాటికలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఆర్. నారా యణమూర్తి పోరు తెలంగాణ సినిమాలో నటించడంతోపాటు మా భూమి, ఆయుధం నాటకాలను సింగరేణి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రదర్శన ఇవ్వడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

సీఎం వ్యాఖ్యలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుమానాలు

తమ భవిష్యత్తు ఏమిటోననే ఆందోళనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు

తెలంగాణ ప్రజానీకానికి ధైర్యం నింపే సీఎం ఇలా మాట్లాడడం దుర్మార్గం

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు పెద్దలా భావించే సీఎం స్వయంగా నాతో ఏం కాదు.. నేనేం చేయలేని స్థితిలో ఉన్న.. రాష్ట్రం దివాలా తీసింది.. అప్పు పుట్ట లేదు.. అణా పైసా ఎవ్వలిత్తలేరు.. బ్యాంకులకు పోతే దొంగోని లెక్క చూస్తున్నరు.. అంటూ వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటదా..? ఉండదా..? అనే అనుమానాలు తెలంగాణ సమాజంలో తలెత్తుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి ధైర్యం నింపే సీఎం ఇలా మాట్లాడడం దౌర్భాగ్యం.. సిగ్గుచేటని అన్నారు. ఆయన మాటలతో దేశవ్యాప్త చర్చ సాగుతోందని, తమ భవిష్యత్తు ఏమిటోననే ఆందోళనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పడిపోయారని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లి ప్రధా ని, కేంద్ర మంత్రులను కలిశానని రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నారని అక్కడ అభినందనలు తెలుపుతూ ఇక్కడ తనకు అపాయింట్‌మెంటు ఇవ్వట్లేదని సీఎం అబద్ధాలు చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఢిల్లీకి పోతే చెప్పులెత్తుకుపోయేటోని లెక్క చూస్తుండ్రని, ఆ కల్చర్ కాంగ్రెస్‌లో ఉంటుంది కావచ్చని అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందని, కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పుల పాలు, అధోగతి చేసిండ్రని ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు, మేం చెప్పినమని అన్నారు. ఎలక్షన్లప్పుడు డబుల్ ఇంజన్ సర్కారు రావాలని కోరినం, ప్రజలను ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేసినం.. ప్రజలేం చేసిండ్రు.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని మీరు చెప్పితే నమ్మి ఓట్లేసిండ్రని అన్నారు. యేడాదిలోనే అప్పులు తీర్చడంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొంటూ అనేక ప్రాంతాల్లో బాండు పేపర్లు రాసిచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు సమాధానం చెప్పాలని ప్రజలు నిలదీస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయడం కోసం సిద్ధంగా ఉన్నామని 2022లోనే ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని విరమించుకోకుండా కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

రాహుల్, ప్రియాంకగాంధీలు సంవిధాన్‌పై ప్రతిజ్ఞ చేసి చెప్పాలి

తెలంగాణలో జరిగిన గత ఎన్నికల్లో సంవిధాన్ పుస్తకం చేత పట్టుకుని కేసీఆర్ అప్పులు చేశారు మేం తీర్చుతాం.. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు ప్రతిజ్ఞ చేసి పోయిండ్రు.. అదే సంవిధాన్ బుక్ పట్టుకుని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు తెలంగాణ రాష్ట్రానికి రావాలని, ప్రజలను మేం సమీకరించి బహిరంగ సభను పెడ్తాం.. ప్రజలు అడిగే ప్రశ్నలకు ప్రతిజ్ఞ చేసి చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటాలు వాస్తవమేనని అంగీకరించగలరా..? అని ప్రశ్నించారు. దేశంలో ఉగ్ర, తీవ్ర వాదాన్ని తుద ముట్టించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తుపాకీ ద్వారా సాధించేది ఏమీ లేదని అన్నారు. కర్రెగుట్టల్లో మావోలపై 'ఆపరేషన్ కగార్' పేరిట కేంద్ర బలగాలు వేట సాగిస్తుండడం పట్ల మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలు రెండు నాల్కల ధోరణిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. అమాయకులైన ఆదివాసీలు, ప్రజలను పొట్టపెట్టుకుంటున్న వారికి మద్దతు పలకడం ఏం నీతి అని ప్రశ్నించారు. మావోలపై నిషేధం ఎత్తివేసే దమ్ము సీఎంకు ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సంజయ్

ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న పోచమ్మ విగ్రహా ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ప్రజలు ఘనస్వాగతం పలికారు.పారిశుధ్య కార్మికులను మంత్రి బండి సంజయ్ సన్మానించారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐలు రమాకాంత్, లక్ష్మణ్, ప్రత్యేక పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు తిరుపతి, బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, శంకర్, మల్లేశం, మల్లారెడ్డి, నరేశ్, కిరణ్ నాయక్, గాల్‌రెడ్డి, రాజిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

ఇల్లంతకుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు గ్రామాల్లో వివాహ వయస్సుపై అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి జీవనజ్యోతి సూచించారు. ఆశ డే సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామాలలో జరిగే వివాహాల గురించి తెలుసుకొని బాల్య వివాహాలపై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్యవివాహాలవల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించడం వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో వెంకటరమణ, సీహెచ్‌వో శాంత, పీహెచ్ఎన్ తారలతో పాటు వైద్యసిబ్బంది, వివిధ గ్రామాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్మాలలో పోచమ్మ బోనాలు

గంభీరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్మాల గ్రామంలో బోనాలను తీశారు. మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బోనాలు సమర్పించారు. స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా సాగాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

బియ్యం వితరణ

ఎల్లారెడ్డిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని నిరుపేద కేశంపల్లి బాబు కుటుంబానికి స్థానిక అమ్మ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళీమోహన్‌గౌడ్ 50 కిలోల బియ్యం మంగళవారం వితరణ చేశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాలయ్య, సురేశ్, సాగర్, సద్దాం, బాలు, సాయి, మనోజ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఎల్లారెడ్డిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎంఈవో కృష్ణహరి, స్థానిక నాయకులు మంగళవారం అభినందించారు. శాలువాలతో సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు సైకాలజిస్టులు కృషి చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నంచందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలో మంగళవారం తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఫార్మేషన్‌డే సందర్భంగా కేక్‌లను కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నం చందర్ మాట్లాడుతూ సైకాలజిస్టుల బాధ్యత సామాజికంగా ఎంతో గౌరవనీయమైనదన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంజనేయులు, ప్రధాన కార్యదర్శి చొప్పదండి శ్రీనివాస్, అల్వాల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న అధికారి

వేములవాడ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ఐఆర్ఎస్ రంజిత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ కండువా కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.

బీజేపీలో చేరిక

వేములవాడ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం గుర్రంవానిపల్లికి చెందిన పలువురు యువకులు మంగళవారం బీజేపీలో చేరారు. గ్రామంలోని పార్టీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు ఆవిష్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ ఆధ్వర్యంలో వికాస్‌రావు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిరికొండ శ్రీనివాస్, చింతపల్లి వెంకటేశ్వర్లు రావు, జింక అనిల్, జింక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హిందూ ఏక్తా యాత్ర పోస్టర్ విడుదల

గంభీరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం హిందూ ఏక్తా పోస్టర్‌ను విడుదల చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ నుండి ఈనెల 22న ప్రారంభమయ్యే హిందూ ఏక్తా యాత్ర పోస్టర్‌ను స్థానిక తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు ప్రభాకర్, ప్రసాద్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, నారాయణ, స్వామి, రమేష్, రాజు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

● కోనరావుపేట : హిందు ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ కార్యకర్తల సమావేశంతోపాటు ఈనెల 22న జరిగే హిందూ ఏక్తాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొట్టె రామచంద్రం, జింక వెంకటి, అంబోజ లక్ష్మీనారాయణ, వెలిశాల రవీందర్, బొల్లారం తిరుపతి, బాపురెడ్డి, మొత్కు మోహన్, నాగరాజు, కిషన్, తిరుపతి, సురేష్, దిలీప్, శ్రీనివాస్, పరుశురాం, మహేష్, లింబయ్య, సుధాకర్, జితేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న కోడెలకు పశుగ్రాసం అందజేత

కోనరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పుణ్యక్షేత్రమైన శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ కోడెలకు పశుగ్రాసాన్ని అందజేశారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామానికి చెందిన ముంద్రాయి విజయ్ కుమార్ సుమారు పదివేల విలువగల పశుగ్రాసాన్ని వేములవాడ ఆలయ అధికారులకు అందజేశారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రికి వినతి

ఎల్లారెడ్డిపేట, మే 6(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయాలి..

గంభీరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరుచేయాలని జర్నలిస్టులు మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందజేశారు. సంజయ్ సానుకూలంగా స్పందించారు.

రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

కోనరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీవో శంకర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో మంగళవారం 968దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో రాజీవ్ యువ వికాస్‌ల కోసం 2700మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

బెనిఫిట్స్ అందించాలి..

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతిచెందిన అంగన్‌వాడీ టీచర్ తుంగ ఉమామహేశ్వరికి బెనిఫిట్స్ అందించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఉమామహేశ్వరి ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందగా, సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. మంగళవారం ఏఐటీయూసీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మృతురాలి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి కదారి రాములుతో పాటు మమత, పద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వేతనాలు ఇవ్వాలి

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్లలో ఆర్డర్ ఇచ్చిన చీరలను తయారుచేసే కార్మికులకు మెరుగైన వేతనాలు ఇవ్వడంతో పాటు సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం పాలిస్టర్, వస్త్రవ్యాపార సంఘాల భవనాల ఎదుట ధర్నాచేస్తామని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మికభవనం వద్ద మంగళవారం కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతనాలు తగ్గించాలని చూస్తున్న యాజమానులపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ సిరిసిల్ల నియేజకవర్గం ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, మచ్చవేణు, వెంకటేశం, రమేష్, ప్రవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై మాట్లాడితే కేసులు..

- కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట ప్రభుత్వం మోసం.. - కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



రైతులతో మాట్లాడుతున్న బండి సంజయ్

గంభీరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలపై మాట్లాడితే ఇతర పార్టీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు పోలీస్‌లపై ఒత్తిడి తెచ్చి కేసులు పెడతారా అంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బండి సంజయ్ సందర్శించారు. రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అప్పులు పుడతలేవు, పంట దిగుబడి తగ్గింది.. వచ్చిన ధాన్యాన్ని అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల్లో ఈ పరిస్థితి సారూ.. అంటూ బండి సంజయ్‌తో రైతులు గోడు వెల్లబోసుకున్నారు. వానొస్తే టార్పాలిన్ కవర్లు కూడా లేవు.. కిలోల కొద్ది కోత పెడుతున్నారు అంటూ వాపోయారు. ఈ సందర్భంగా బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, కనీసం వారి గోడు వినడానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు రావడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బంది ఏంటో చెప్పాలన్నారు. పండించిన ప్రతి గింజను కేంద్ర ప్రభుత్వమే కొంటుందని, సుతిలు తాడు, గోనెసంచి, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, లేబర్ పైసలు... ఇలా అన్ని పైసలు కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంటే కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏందో చెప్పాలన్నారు. 25రోజులుగా ధాన్యం కొనుగోళ్లకు అతీగతీ లేదని, ఇంత దరుణం ఎక్కడా లేదన్నారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 580 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, ఈ రెండు జిల్లాలో 7 లక్షల మెట్రిక్ టన్నుల టార్గెట్ ఉంటే, ఇప్పటివరకు రెండున్నర లక్షలు కూడా దాటలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదేపరిస్థితి ఉందన్నారు. నిన్నమొన్న పడిన వర్షాలతో రైతులకు చాలా నష్టం వాటిల్లిందని, ధాన్యం ఎండకు ఎండుతోందని, వానకు తడుస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో, ఆ తరువాత.. ఇలా రెండుసార్లు కటింగ్ చేస్తుండటంతో ఒక్క క్వింటాలుకు కిలోల చొప్పున నష్టం వస్తోందన్నారు. మండల స్థాయి అధికారులకు, జిల్లా అధికారులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇస్తే సమస్య ఉండేది కాదని, రాజకీయ జోక్యంతోనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. రైతు సమస్యలపై ప్రశ్నిస్తే పోలీస్‌లపై ఒత్తిడితెచ్చి కేసులు పెడుతున్నారన్నారన్నారు. గత ప్రభుత్వం ఏ విధంగా అరాచకం చేసిందో ఈ ప్రభుత్వం కూడా దానికి తగ్గట్టుగానే అరాచకం చేస్తుందన్నారు. వడ్ల డబ్బులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే కొనేది కేంద్ర ప్రభుత్వమే మధ్యలో మీడియటర్‌గా ఉండే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటో ఇప్పటికైనా చెప్పాలన్నారు. చివరికి ముఖ్యమంత్రి తనతో ఏమికాదని, చేతులు ఎత్తేశాడని గుర్తుచేశారు. యుద్ధప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేయాలని, వడ్ల డబ్బులన్నీ రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల బీజేపీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధులు గడ్డమీది ప్రసాద్‌రెడ్డి, దేవసాని కృష్ణ, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కోడె రమేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, సత్యనారాయణ, స్వామి, నాగరాజు, రాజు తదితరులు ఉన్నారు. కాగా, నర్మాల గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొన్నారు. శివలింగసహిత మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

మండలకేంద్రంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణను బండి సంజయ్ పరామర్శించారు. ఇటీవల కృష్ణ తండ్రి జనార్దన్ మృతిచెందడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

స్పందన అంతంతే..

(5వ పేజీ తరువాయి)

మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటిపారుదలశాఖ, పంచా యతీరాజ్ శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేక బృందాలను దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసింది. వాటిని పరిశీలించి దరఖాస్తుదారులకు సమా చారం అందించారు. 25శాతం రాయితీని ప్రకటించినా అనుకున్న మేరకు వేగం పెరగలేదు. మళ్లీ తాజాగా ప్రభుత్వం ఏప్రిల్ 30లోపు దరఖాస్తు చేస్తే 25 శాతం రాయితీపై గడువు పొడిగించింది. లే అవుట్‌లలో కేవలం పది శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యి ఉండి.. మిగిలినవి రిజిస్ట్రేషన్ కాకపోతే 90 శాతం ప్లాట్లు క్రమబద్ధీకరణకు అనుమతిస్తున్నారు. చాలా మంది రియల్టర్లు అనుమతి లే అవుట్ ప్లాట్లు కొన్నవారు రూ 10 వేల చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత రూ 1000 చొప్పున చెల్లించారు. ప్రస్తుతం రాయితీతోనైనా ఎల్ఆర్ఎస్ ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నా వేగం మాత్రం కనిపించడం లేదు.

జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఇలా..

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చిన 42,942 దరఖాస్తుల్లో 37,071 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో సిరిసిల్ల మున్సిపాలిటీలో 10,493 దరఖాస్తులు, వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో 16,336 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉండగా 16113 దరఖాస్తులు వచ్చాయి. బోయినపల్లి మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో 645 దరఖాస్తులు, చందుర్తిలో 15 గ్రామపంచాయతీల్లో 213, ఇల్లంతకుంటలో 24 గ్రామపంచాయతీల్లో 1054, గంభీరావుపేటలో 17 గ్రామపంచాయతీల్లో 861, కోనరావుపేటలో 15 గ్రామపంచాయతీల్లో 277, వేములవాడ అర్బన్ మండలంలో 9 గ్రామపంచాయతీల్లో 3702, ముస్తాబాద్ మండలంలో 1074, ఎల్లారెడ్డిపేట మండలంలో 16 గ్రామపంచాయతీల్లో 3949, తంగళ్లపల్లిలో 26 గ్రామపంచాయతీల్లో 3784, వేములవాడ రూరల్ మండలంలో 15 గ్రామపంచాయతీల్లో 214, రుద్రంగిలో రెండు గ్రామపంచాయతీల్లో 304, వీర్నపల్లిలో మూడు గ్రామ పంచాయతీల్లో 71 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో ప్లాట్‌కు గత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీసం రూ 20 నుంచి రూ 50 వేల వరకు ఆదాయం లభిస్తుంది. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి 25 శాతం రాయితీ ప్రకటించినా దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రాకపోవడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో భూముల ధరలు ఆశాజనకంగా లేకపోవడం, అమ్మకాలు లేకపోవడం, భూ సంబంధ వివాదాలు కేసులపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేకపోవడం వంటి కారణాలతోనే దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. మరోవైపు నిషేధిత ఖాతాల్లోకి అనేక ప్లాట్లు వెళ్లాయి. ఆ ప్లాట్ల క్రమబద్ధీకరణ కష్టమేనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

చందుర్తి, (రుద్రంగి) మే 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. రుద్రంగి, మానాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. రైతులు, ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని తెలిపారు. ఇప్పటికే అన్ని మండలాల్లో నూతన చట్టం గురించి అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రుద్రంగి మండలాన్ని పైలెట్ ప్రాతిపదికన ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూసమస్యలు, సర్వేనంబర్ మిస్సింగ్, పట్టా పాస్‌బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట- బీలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం ప్రకారం అధికారుల క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో కూడా అప్లై చేసుకోవచ్చన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్దీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేస్తారన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మానాల కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణను ఆర్డీవో శేషాద్రితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే తరలించాలని, కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు.

పాకిస్థానీలను వెనక్కి పంపించాలి

ఇల్లంతకుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ పౌరులను గుర్తించి వెంటనే వెనక్కి పంపించాలని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ కోరారు. మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు బత్తిని సాయగౌడ్, నాయకులు మ్యాకల మల్లేశం, దేశెట్టి శ్రీనివాస్, కొలనూరు ముత్తవ్వ, మామిడి హరీష్, కమలాకర్‌రావు, మారవేణి రాజు, శ్రీశైలం, జనగం మాధురి, పినకాశి అనీల్, గజ్జల రమేష్, జంగిటి బాబు తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ ముస్లింలను వెనక్కి పంపించాలని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్, ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, మాడుగుల లింబాద్రి, పోతారం నరేష్, బానోతు శ్రీనివాస్, తిరుపతి, పెద్దరాజు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తంగళ్లపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపేటలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మఇళ్లను జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి శార్ఫోద్దీన్ పరిశీలించారు. మంగళవారం మండలంలోని సంబంధిత అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా, ఏఈ, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

రోడ్డును మరమ్మతు చేయాలి

వేములవాడ రూరల్ మే 6 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి బ్రిడ్జి వద్ద లారీ నుంచి ధాన్యం బస్తాలు మంగళవారం కింద పడ్డాయి. చందుర్తి మండలం మరిగడ్డలోని ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రం నుంచి బోయినపల్లి మండలంలోని రైస్‌మిల్‌కు తరలిస్తుండగా మర్రిపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ధాన్యం బస్తాలు కింద పడ్డాయి. రోడ్డును చదును చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సేంద్రియ పంటలను సాగుచేయాలి

- అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేస్తున్న పాతపద్ధతులను వదిలి ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించడంతో పాటు సేంద్రీయ పంటల సాగులపై ఆసక్తి చూపాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సతీష్, డాక్టర్ సందీప్‌లు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు -అన్నదాతలకు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట వార్డు కార్యాలయంలో మంగళవారం జిల్లెల్ల బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులకు క్షేత్రస్థాయిలో అవసరమయ్యే అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవ సాయ సాగులో యూరియాను వాడకం తగ్గించడం కోసం పచ్చిరొట్ట పంటలను సాగుచేసుకోవాలన్నారు. అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం వల్ల నేలను ఆరోగ్యంగా ఉంచవచ్చనన్నారు. రైతుల తాము వ్యవసాయం కోసం కొన్న విత్తనాలు, ఎరువులు, మందులకు రసీద్‌లు తీసుకుని భద్రపర్చుకుంటే కష్ట కాలంలో నష్టపరిహారాన్ని పొందడానికి అవి ఉపయోగ పడుతాయన్నారు. సాగు నీటిని ఆదా చేయడం వలన భావి తరాలకు సహాయం అందించవచ్చన్నారు. పంటల మార్పిడి పాటించడం వల్ల సుదీర్ఘ ఆధాయాన్ని పొందవచ్చన్నారు. చెట్లను ఎక్కువగా పెంచుకుని పర్యావరణాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయానికి సంబంధించిన సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు లతశ్రీ, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత బేధాబిప్రాయలకు పోకుండా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, పాత, కొత్త కలయికతో పార్టీ పునర్నిర్మాణం జరగాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సంఘంలో సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్ బ్లాక్ 1 స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిలుగా కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి, ఏఐసీసీ పరిశీలకులు మహమ్మద్ ఖాజ ఫక్రుద్దీన్, చైతన్య కృష్ణారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీకి పట్టాం కట్టారన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. ప్రజల ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నట్లు చెప్పారు. పార్టీకి కష్టకాలంలో అండగా ఉన్న కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరల పేరు మీద నేతన్నలు మోసం చేసి దోచుకున్నారని. నేతన్నలకు బకాయిలు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. చేనేత రంగానికి సంబంధించి సుమారు రూ 250 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుద చేసి నేతన్నలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. నేతన్నలను అండగా ఉండి ఆదుకొనే ప్రయత్నం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ప్రాంతీయ తత్వంతో బీఆర్ఎస్, మత తత్వంతో బీజేపీ పార్టీలు ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని ప్రజల గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు గడ్డం నరసయ్య, కనవేని చక్రధర్ రెడ్డి, మడుపు శ్రీదేవి, చొప్పదండి ప్రకాష్, జలగం ప్రవీణ్, నేరెళ్ల నర్సింగం, చుక్క శేఖర్, హారిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి (రుద్రంగి) మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో అర్హులైన 22 మంది లబ్ధిదారులకు 7 లక్షల పైచిలుకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి మండల కేంద్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని కోటి 43 లక్షలతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. తద్వారా ప్రజలకు వైద్య సేవలు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా మండల కేంద్రంలోని చికిత్స తీసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. పేదలకు ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దని పడించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చెల్కల తిరుపతి, ఎంపిడిఓ నటరాజ్, మాజి జడ్పిటిసి సభ్యుడు గట్ల మీనయ్య, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాసరెడ్డి, కొమురె శంకర్, గండి నారాయణ, తూం జలపతి, యాదయ్య, గంగారాజం, అభిలాష్, గంగధర్, రాజలింగం, లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనం అవరణంలో మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను కార్మికులతో కలిసి నాయకులు అవిష్కరించారు. సమ్మెను కార్మికులు విజయవంతంచేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, మచ్చవేణు, గాజుల రాజు, బూట్ల వెంకటేశ్వర్లు, హరిదాసు, సుదన్, రమేష్, శ్యాం, సతీస్, సదానందం తదితరలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అందించే వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థులను తల్లిదండ్రులు పంపించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శైలాజ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వేసవి ఉచిత శిక్షణ శిబిరాలను ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖలతో కలిసి జిల్లా సెక్టోరియల్ అధికారి శైలాజ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో విద్యార్థులకు డ్రాయింగ్, నృత్యాలు, యోగా, కరాటే, సైన్స్ ప్రాజెక్టులు, కంప్యూటర్‌శిక్షణ, నీతికథలు, తోటపనులపై శిక్షణతోపాటు విద్యార్థులకు అల్పాహారం ఇస్తామన్నారు. ఉపాధ్యాయులు గన్నమనేని శ్రీనివాసరావు, గుత్తికొండ రాజశేఖర్, కోడం భారతి, సమ్మర్ క్యాంపు వాలీంటర్లు పాల్గొన్నారు.

● బోయినపల్లి : మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని మండల విద్యాధికారి యం శ్రవణ్ కుమార్‌తో పాటు హెచ్ఎం బొలగం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్‌హెచ్ఎం సీహెచ్ మల్లేశం, ఉపాధ్యాయుడు కట్ట వెంకటహనుమాన్, వ్యాయామ ఉపాధ్యాయుడు పంతం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి (రుద్రంగి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపును మంగళవారం రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు కే.సమ్మిరెడ్డి, మండల విద్యాధికారి రామకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కల్పన, ఉపాధ్యాయులు గడప వేణు కుమార్, ప్రత్యేక శిక్షకులు దరిపల్లి రవి, అక్కెనపల్లి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

బోయినపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థుల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా 5వ రోజున తడగొండలో సేవ్ సాయిల్(మట్టిని రక్షించు) అనే అంశంపై ప్రచారం చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులు తెలంగాణ సంస్కృతి అయిన బతుకమ్మ వేడుకలను నృత్య రూపంలో ప్రదర్శించారు. సమాజంలో పిల్లలపై జరిగే వేధింపులను నాటకం రూపంలో ప్రదర్శించారు.